పారిశుద్ధ్యం అస్తవ్యస్తం


శేరుపల్లెలో పేరుకు పోయిన చెత్తాచెదారం

- ప్రత్యేకాధికారుల పాలనలో నిర్లక్ష్యం
- పంచాయతీ కార్మికులకు వేతనాలు రాక ఇబ్బందులు
- చిన్న గ్రామాల్లో నిధుల కొరత
- అధికారుల బదిలీలు.. ఆగిన గ్రామాభివృద్ధి


మారమునగాల-2లో నిల్వ ఉన్న చెత్త

ఉండవెల్లి: గ్రామాల్లో సర్పంచులు ఉన్నప్పుడు అధికారులు లేకున్నా పనులు సకాలంలో నిర్వహించేవారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. కొద్ది రోజులుగా గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయాల్లో, మండల స్థాయిలో ఎంపీఓలు, ఏపీఓలు, కార్యదర్శులు బదిలీలు కావడంతో గ్రామాల్లో పని తీరు పక్కకు నెట్టేశారు.

బదిలీలో కార్యదర్శులు..

మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు బదిలీలు కావడంతో ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి ఉంది. ఏదైనా సమస్య చెప్పాలంటే ప్రత్యేక అధికారులు ఎవరో, కార్యదర్శులు ఎవరో తెలియక సతమతమవుతున్నారు. చిన్న గ్రామ పంచాయతీలకు కార్మికులకు జీతాలు రావడం లేదు. కార్యదర్శులు జీతాలు ఇవ్వాల్సిన పరిస్థితిల్లో వారే లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది.

మేజర్ పంచాయతీలకు ఇన్‌చార్జులే..

గ్రామాల్లో పన్ను వసూలు, సమస్యలు, జనన, మరణ ధృవీకరణ పత్రాలకు సంబంధించిన వాటిని ఉపయోగించాలంటే కార్యదర్శులు ఉండాలి. మండల కేంద్రంలో విధుల్లో ఉన్న కార్యదర్శి మూడు నెలలు సెలవు తీసుకోవడంతో ఆ స్థానంలో మరో కార్యదర్శిని ఇన్‌చార్జిగా ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి కార్యదర్శి సైతం గద్వాలకు బదిలీపై వెళ్లడంతో కంచుపాడు కార్యదర్శిని మండల కేంద్రానికి బదిలీ చేశారు. మెన్నిపాడు గ్రామ కార్యదర్శిని బొంకూరుకు ఇన్‌చార్జిగా నియమించారు. రెండు గ్రామాలకు ఒకే కార్యదర్శిని నియమించడంతో గ్రామాల్లో పనులు స్తంభించాయి. బైరాపురానికి ఇటిక్యాలపాడు కార్యదర్శి, చిన్న ఆముదాలపాడుకు మారమునగాల కార్యదర్శి ఇన్‌చార్జిగా నియమించారు. రెండు గ్రామాలకు ఒకే కార్యదర్శి ఉండడంతో ప్రజల సమస్యలు ఎలా తీరుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపు లేదు..



గ్రామంలో నిధులు లేక చెత్తను కార్మికులు తీసుకెళ్లడం లేదు. కార్యదర్శిలేడు. జీతాలు రాక ఇబ్బందులున్నాయని గ్రామ పంచాయతీ కార్మికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాన్ని పరిశుభ్రం చేయించాలి.

– రఫీ, మారమునగాల-2

అన్ని గ్రామాలు శుభ్రం చేస్తున్నాం..



ప్రతి గ్రామ కార్యదర్శులు బదిలీలు కావడంతో గ్రామాల్లో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం అన్ని గ్రామాలకు కార్యదర్శులను ఏర్పాటు చేశాం. గ్రామాల్లో అన్ని పనులు పూర్తి చేసి అభివృద్ధి చేస్తాం.

– తిరుపతన్న, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఉండవెల్లి

క్లుప్తంగా

నేడు ఓటరు జాబితాపై సమావేశం

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, నాయకులు హాజరుకావాలని తెలిపారు.

ధరూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితాకు సంబంధించి సూచనలు, సలహాలు తీసుకునేందుకు వివిధ రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని వారు కోరారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బుధవారం అర్చకులు ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మూగ జీవాలను కాపాడండి



అయిజ: ప్లాస్టిక్ వ్యర్థాలను తిని మూగజీవులు మృతి చెందుతున్నాయని, ప్లాస్టిక్ కవర్లను నిషేధించి జంతువులను కాపాడాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మారెడ్డికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి మాట్లాడారు. దేవుళ్ల పేరుమీద ప్రజలు ఆవులను వదిలివేశారని, మిగిలిపోయిన ఆహార వస్తువులను ప్రజలు ప్లాస్టిక్ కవర్లలలో పెట్టి విసిరివేయడంతో మూగజీవులు వాటిని తిని అనారోగ్యం పాలవుతున్నాయన్నారు. ఇప్పటికే కొన్ని ఆవులు మృతి చెందినట్లు తెలిపారు. అధికారులు చర్యలు చేపట్టి మూగజీవులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో భీమసేన రావు, ప్రదీప్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, శేఖర్, లక్ష్మణాచారి, రఘు ఉన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మల్దకల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాల్వాయి రాముడు అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం మండలంలోని పాల్వాయి, మల్లెందొడ్డి, విఠలాపురం గ్రామాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, రామిరెడ్డి, ఖాజామైనొద్దీన్, జయన్న, గజ్జెలన్న, చిన్న రాముడు, మహబూబ్, తిమ్మన్న పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నిక



అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చిలుకూరి వేణుగోపాల్‌శెట్టి, ప్రధాన కార్యదర్శిగా ఇల్లూరి వెంకట్రామయ్యశెట్టి, ఉపాధ్యక్షులుగా కెకె సత్యం, కట్టా పణిభూషణ్, చిలుకూరి నాగరాజు, సత్యనారాయణ, కోశాధికారి చిలుకూరి రమేష్ గుప్తా, సహాయ కోశాధికారిగా గొందిమల్ల శ్రీధర్, సహాయ కార్యదర్శులుగా కట్ట సుబ్రమణ్యం, చిలుకూరి రవిప్రకాష్, మురళీ, గౌరవ సలహాదారులుగా గోపాల కృష్ణయ్య, కృష్ణమూర్తి, చిన్మయనంద, మధుసూదన్, తదితరులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. మహిళా మండలి సంఘం గౌరవ అధ్యక్షులుగా వరలక్ష్మమ్మ, అధ్యక్షులుగా లగిశెట్టి సుశీలమ్మ, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరి రమాదేవి, కోశాధికారిగా చిలుకూరి ఉషాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దళితవాడల్లో సమస్యలు పరిష్కరించండి


అలంపూర్ మున్సిపాలిటీలో కందకాలను పరిశీలిస్తున్న నాయకులు

అలంపూర్: మున్సిపాలిటీలోని దళిత వాడల్లో సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేపల్లె దేవదాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులు డిమాండ్ చేశారు. అలంపూర్ మున్సిపాలిటీలోని సమస్యలపై మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కందకాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంతోష్‌నగర్, సంత మార్కెట్, న్యూ ప్లాట్స్ వంటి దళిత వాడల్లో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సంతోష్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచి చెరువులను తలపిస్తున్నట్లు పేర్కొన్నారు. సంత మార్కెట్ కాలనీ పక్కన ఉన్న కందకంలో వర్షపు నీరు నిలిచి ప్రజలు రోగాలబారిన పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అక్బర్ పేట, కుమ్మరి వీధి, చిన్నదర్గా వద్ద ముళ్ల పొదలు పెరిగి ఎస్ఎస్‌పీ పంప్‌మోటార్ల వరకు రావాల్సిన వర్షపు నీరు అక్కడే నిలుస్తున్నట్లు తెలిపారు. కందకంలో వర్షపు నీరు వెళ్లడానికి వీలుగా కల్వర్టు నిర్మాణం చేపట్టాలన్నారు. న్యూ ప్లాట్స్ కాలనీలో దళితులకు శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు పట్టించుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర యాదవ్, కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

- డీజీఎం కృష్ణ ప్రసాద్


ధరూరులో నూతన బ్యాంకు భవనాన్ని పరిశీలిస్తున్న డీజీఎం కృష్ణ ప్రసాద్

ధరూరు: ఆర్థికంగా వెనుకబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఇప్పుడిప్పుడే కోలుకొని ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయని, అందుకు సంఘం సభ్యుల సహకారం ఎంతో అవసరమని కో ఆపరేటివ్ సొసైటీ డీజీఎం కృష్ణ ప్రసాద్ అన్నారు. నాలుగు రోజుల క్రితం మండల కేంద్రంలో కో ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్మించి పెట్రోల్ బంక్, ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు, గోదాంలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే మొట్ట మొదటి సారిగా ధరూరులో పెట్రోల్ బంక్‌ను ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఇక్కడి సహకార సంఘం సభ్యులు అదృష్టవంతులన్నారు. సహకార సంఘాల ద్వారా క్రాప్ లోన్స్, దీర్ఘకాలిక రుణాలు, నూతన పెట్రోల్ బంకు ద్వారా లాభాలు ఆర్జిస్తాయన్నారు. సహకార సంఘం సభ్యులతో పాటు గ్రామస్తులను మన బంక్‌లోనే పెట్రోల్ పోయించుకునేలా చూడాలన్నారు. రైతులు తమ ట్రాక్టర్లకు, డోజర్‌లకు ఇతర వాహనాలకు ఇక్కడే పెట్రోల్ పోయించుకునేలా చర్యలు తీసుకుంటే మరిన్ని లాభాలను పొందవచ్చన్నారు. బ్యాంకు ద్వారా గోల్డ్‌లోన్స్ పొందే అవకాశం ఉందన్నారు. కొత్త భవనంలో పటిష్టమైన లాకర్ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో గద్వాల బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, సూపర్‌వైజర్ రామాంజనేయులు, పీఏసీఎస్ బ్యాంకు కార్యదర్శి, సీఈఓ రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం

- ఎమ్మెల్యే విజయుడు


సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ చెక్కులను ఎమ్మెల్యే విజయుడు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఇటిక్యాల మండలం సాతర్లకు చెందిన ఈడిగ భాగ్యమ్మ ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌ఓసీ వచ్చిందన్నారు. ఎర్రవల్లి మండలం దువ్వాసిపల్లికి చెందిన కురువ ఈశ్వర్‌కు ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఎల్‌ఓసీ వచ్చిందన్నారు. వడ్డేపల్లి మండలం శాంతినగర్‌కు చెందిన దినేష్ కుమార్‌కు సీఎం సహాయ నిధి నుంచి ఆపరేషన్ నిమిత్తం రూ.1.50 లక్షలు ఎల్‌ఓసీ వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఎల్‌ఓసీలను అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, హనుమంతు, రవి, జయన్న, ప్రకాష్, శ్రీను, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి


పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంతో డీఎస్పీ నాయకులు

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. అలంపూర్ పట్టణంలోని హరిజనవాడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను వారు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చంద్రశేఖర్‌తో సమావేశమై, పాఠశాలలో సమస్యలను చర్చించారు. పాఠశాలలో రెండేళ్లుగా మూత్రశాలలు, మరుగుదొడ్లకు నీటి కొరత వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తరగతి గదుల్లో పెచ్చులూడి పడుతున్నట్లు తెలిపారు. పాఠశాలలో అటెండర్, స్వీపర్‌లు సైతం లేరని వారి దృష్టికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరేష్ మహారాజ్, అభిషేక్ మహారాజ్, రమేష్ మహారాజ్ ఉన్నారు.

గ్యాస్ సబ్సిడీ ధ్రువీకరణ పత్రాలు అందజేత



అయిజ: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కు ఎల్‌పీజీ సిలిండర్ అందించే కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని రేషన్ దుకాణాల డీలర్లు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పట్టణంలోని 5,400 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొత్తం 18 రేషన్ దుకాణాల పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కుటుంబంలో మూడేళ్లపాటు గ్యాస్ వినియోగాన్ని సగటున పరిగణలోకి తీసుకొని సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నట్లు రేషన్ డీలర్ రాముడు తెలిపారు. సబ్సిడీకి సంబంధించిన డబ్బును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్నట్లు తెలిపారు.

నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసు నమోదు

అయిజ: మండలంలోని ఉప్పలలో వినాయక నిమజ్జనం సందర్భంగా మంగళవారం రాత్రి నిబంధనలు అతిక్రమించిన యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. అనుమతి లేకుండా డీజే పెట్టి పెద్ద శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, అదుపు తప్పిన యువతకు సర్దిచెప్పే ప్రయత్నంలో పోలీసులపై దురుసుగా ప్రవర్తించారని ఎస్ఐ తెలిపారు. ఉప్పల గ్రామానికి చెందిన నరసింహులు, రాజు, నాయికి ఉపేంద్ర, లింగం, వీరేష్, కుర్వ రాంబాబు, జమ్మన్న, రవి గౌడుతో పాటు మరో మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. విచారణ చేసి మరికొంత మందిపై కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గొర్లఖాన్‌దొడ్డిలో వైద్య శిబిరం



గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి, తప్పెట్ల మొర్సు గ్రామాల్లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. భవిష్య భారత్ ఎల్‌టీమైండ్‌ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో డాక్టర్ మురళీధర్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు జిలాని, స్టాఫ్ నర్సు రాగిణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ రమేష్‌ఆచారి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు జయమ్మ, గోవిందమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



గద్వాల: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వర్షాలకు నష్టపోయిన బాధితులకు తనవంతు సాయంగా మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ రవీంద్ర సీఎం సహాయనిధికి రూ.50వేల విరాళం అందజేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి రూ.50వేల చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, అంపయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ నిందితులకు జైలు శిక్ష



అలంపూర్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ఎండీ బాషా తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. అలంపూర్ పరిధిలో డ్రెంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందిని స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో బుధవారం హాజరు పరిచారు. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కమలాపురం కవిత పట్టుబడిన వారికి జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు. అబ్దుల్ రహిమాన్‌కు రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధించారు. నరేంద్ర, మహేష్, పవన్‌కుమార్, నాగమద్దిలేటిలకు ఒక్కొక్కరికి మూడు రోజుల జైలుతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించారు. షేక్ హుసేన్, జీ స్వాములకు ఒక్కొక్కరికి 5 రోజుల జైలుతో పాటు ఒక్కొక్కరికి రూ. 2 వేలు, స్వాములుకు 6 రోజుల జైలుతో పాటు రూ. 2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. పెద్ద నర్సింహ, సురేష్ కుమార్, చోటు కుమార్, తిమ్మన్నలకు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

కోర్టులో 90 మందికి జరిమానా

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద, అలంపూర్ చౌరాస్తా సమీపంలో, రోడ్డు పక్కల మద్యం తాగుతూ పట్టుబడిన 85 మందిని పోలీసులు బుధవారం అలంపూర్ కోర్టులో హాజరు పరిచారు. వారికి జడ్జి కవిత రూ.10 చొప్పున మొత్తం రూ.850 జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 5 మందికి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున మొత్తం రూ.10 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా మాలపున్నమి

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం మాల పున్నమి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాంసాహారంతో కూడిన పిండివంటలను ఆరగించారు. ఆయా గ్రామాల్లో పండుగను పురస్కరించుకుని సందెరాళ్లు, బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ఆయా గ్రామాల నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ధరూర్ మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన పరుశ, రాజులు ఎర్రవల్లి నుంచి గద్వాలకు బైక్‌పై వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు గుర్తు తెలియని బైక్ వారి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదాం


అలంపూర్‌లో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో చేపడుతున్నట్లు పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ బుధవారం పరిశీలించారు. తెల్లవారుజామున 5 గంటలకు మున్సిపల్ కార్మికులు చేపడుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో రోడ్లు, డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టడం వల్ల మున్సిపాలిటీ అందగా ఉంటుందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలన్నారు. వీరితో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సామేల్, తదితరులు ఉన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన పెంచుకోవాలి


మాచర్లలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

గట్టు: సమాజంలోని ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలపై తప్పని సరిగా అవగాహన పెంచుకోవాలని కౌన్సిలర్ ఆంజనేయులు కోరారు. బుధవారం మాచర్ల యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సొసైటి ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఆర్‌డీఓ) యశ్వంత్ అధ్యక్షతన మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలను నిర్వహించే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు చేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. యూనియన్ బ్యాంకు ఆర్‌డీఓ యశ్వంత్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను వాయిదాలను క్రమం తప్పక తిరిగి చెల్లించాలన్నారు. బ్యాంకులు అందించే బీమా సౌకర్యాలను తప్పని సరిగా ఉపయోగించుకోవాలని కోరారు. ఆర్థిక మోసాల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. చాంద్‌పాష, ప్రకాష్, శివకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై గ్రామాల్లో విద్యార్థుల ర్యాలీ


ఉండవెల్లిలో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్న మున్సిపల్ సిబ్బంది

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, మారమునగాల, బైరాపురం గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవపై పంచాయతీ కార్యదర్శులు బుధవారం విద్యార్థులతో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో స్వచ్ఛతపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, కంపచెట్లను మున్సిపల్ కార్మికులు తొలగించారు. పాఠశాల ముందున్న రాజోళి రోడ్డుకు ఇరువైపుల చెత్తాచెదారం తొలగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పారిశుద్ధ్య కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలపై అవగాహన


మల్దకల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ ఈశ్వరయ్య

మల్దకల్: మత్తు పదార్థాలు వాడటం వల్ల కలిగే అనర్థాలపై ఏఎస్ఐ ఈశ్వరయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నర్సింహులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలే కాక కుటుంబ కలహాలు ఏర్పడే ప్రమాదముందని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అధ్యాపకులు రామాంజనేయులు గౌడ్, గోవర్ధన్ శెట్టి, భాగ్యలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, పూజయ్య, నవీన్, తదితరులు పాల్గొన్నారు.